క్లుప్తంగా

క్షయ రహిత సమాజానికి కృషి

నెల్లూరు(అర్బన్): క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో టీబీ కేసులు పెరగడం బాధాకరమన్నారు. మందులను సక్రమంగా వాడకపోతే అది మొండి టీబీగా రూపాంతరం చెంది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జీ శ్రీనివాసులు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం రాత్రి నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో పార్టీలో చేరిన శ్రీనివాసులుకు వారు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రీనివాసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ మురళి, పార్టీ నేతలు ప్రసాద్ యాదవ్, కోవూరు రాఘవ, కట్ట శ్రీనివాసులు ఉన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



నెల్లూరు(అర్బన్): ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మానస డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డులోని వియాని హోంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. హోంలోని పిల్లలతో పాటు పరిసర ప్రాంతాల వారికి దంత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా, వియాని హోం నిర్వాహకులు సిస్టర్ రమ, జయ, వసుంధరా దేవి, పీహెచ్‌పీ నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, మాలిని, తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఐసీడీఎస్ నెల్లూరు ప్రాజెక్ట్ పరిధిలోని నవాబుపేట సెక్టార్, సాతేరాజుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీడీపీఓ అన్నపూర్ణ ముఖ్యఅతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో ఉండే పోషకాలు, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ప్రసన్న, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రత్నంకు మేయర్ నివాళి



నెల్లూరు(బారకాసు): రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం బుధవారం మృతి చెందారు. ఆయన పార్థీవ దేహాన్ని నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ దంపతులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రత్నం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యాదాత రత్నం మరణం విద్యారంగానికి తీరనిలోటు అని పేర్కొన్నారు.

నెల్లూరు(బృందావనం): రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం మృతిపై ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు వీరిశెట్టి హజరత్‌బాబు, ఉపాధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు. రత్నం మరణం జిల్లా విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

మెడికవర్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స

నెల్లూరు(అర్బన్): మెడికవర్ ఆస్పత్రిలో ఓ వ్యక్తికి అరుదైన అత్యంత క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడామని ఆ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ సంజీవ్‌సురేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన 52 ఏళ్ల పుల్లారెడ్డి తీవ్రమైన గుండె మంట, ఆయాసంతో కడపలోని ఓ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు యాంజియోగ్రామ్ చేసి గుండె రక్తనాళాలు కుడివైపు వంద శాతం, ఎడమవైపున 95 శాతం మూసుకుపోయాయని, వెంటనే బైపాస్ చేయాలని చెప్పారు. అక్కడ ఎమెర్జెన్సీ సేవలు అందుబాటులో లేక మెడికవర్ ఆస్పత్రికి తీసుకు రాగా అత్యంత రిస్క్‌తో కూడుకున్న ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారని వివరించారు. మత్తు డాక్టర్ వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

సౌకర్యాలను పునఃపరిశీలించండి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్

• నెల్లూరు సిటీ ఈఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను సెక్టార్ అధికారులు పునఃపరిశీలించాలని ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సూచనల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన్‌లో నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సెక్టర్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మరోసారి సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు. ఓటర్లకు బహిరంగంగా కనిపించేలా పోలింగ్ కేంద్రం పేరు, నంబర్‌తో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఫర్నిచర్‌ను పరిశీలించి ఇంకా అవసరమైతే సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయోవృద్ధుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్ ర్యాంప్, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, ఫ్యాన్లు, తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సిబ్బందికి వర్తించే ప్రత్యేకాధికారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో వారికి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులు, పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని ఈఆర్వో వికాస్‌మర్మత్ నోడల్ అధికారులకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నోడల్ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యంపై సమీక్షించి సూచనలు చేశారు. కేంద్రాలకు వచ్చి ఓటు వేయలని వృద్ధులు, దివ్యాంగులు, పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు ముందస్తుగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా పోస్టల్‌బ్యాలెట్ అధికారులు డ్వామా పీడీ డీ వెంకట్రావ్, తిరుపతయ్య, ఏఆర్వో శర్మద, ఏఈఆర్వో వెంకటేశ్వరరావు, డీపీఆర్వో ప్రసాద్, ఆర్వో, డీటీ మాధవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్ కృషి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్‌అహ్మద్

• వైఎస్సార్‌సీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 4వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైపాడు రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించినట్లు తెలిపారు. జాఫర్‌సాహెబ్ కాలువకు రిటైనింగ్ వాల్, సీసీరోడ్లు, డ్రెయిన్లు, పార్కుల అభివృద్ధి, తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేసిందని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, నగర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తమను అత్యధి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం నిర్వహించారు. గతేడాది డిసెంబరు 30 నుంచి ఈ ఏడాది మార్చి 20వ తేదీ వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.6,20,377 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ తెలిపారు. హుండీ లెక్కింపును దేవదాయశాఖ అధికారి సుధీర్ పర్యవేక్షించారు.

ఉమామహేశ్వరుడి ఆలయంలో..

సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. గతేడాది డిసెంబరు 18 నుంచి ఈ ఏడాది మార్చి 20 వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.1,01,700 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్ పర్యవేక్షించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌సీ బాలాజీసింగ్, అర్చకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరస్వామి ఆలయంలో..

‘పెరుగు’కు కీర్తి పురస్కారం



నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన కవి పెరుగు రామకృష్ణ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 సంవత్సరానికి గానూ ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని 46 మంది ప్రముఖులకు బుధవారం కీర్తి పురస్కారాలను ప్రదానం చేసింది. అందులో భాగంగా సాహిత్య రంగంలో పెరుగు సేవలను గుర్తించి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. వర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ భట్టు రమేష్, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం గోదాములో తనిఖీలు



మద్యం నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెల్లూరురూరల్ మండలం దేవరపాళెం వద్ద ఉన్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్యం గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ బుధవారం తనిఖీ చేశారు. గోదాములోని మద్యం స్టాక్ వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ నాగమల్లేశ్వరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గోదాములోని మద్యం నిల్వలను పరిశీలించి వాహనాల రాకపోకల నమోదు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. స్టాక్ తరలింపు, నిల్వ చేయడంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కలెక్టర్ వెంట సీఐలు శీను బాబు, రేఖ, గౌరి, ఎస్సై పీవీ శేషయ్య, అసిస్టెంట్‌మేనేజర్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ రామారావు తదితరులు ఉన్నారు.

పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ ఏర్పాటు

నెల్లూరు(క్రైమ్): సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని గుంటూరులోని కాజా టోల్‌గేట్ వద్ద ఉన్న లాస్య రెసిడెన్సీ–2లోని 106, 107 ఫ్లాట్లలో ఏర్పాటు చేసినట్లు జిల్లా పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ అధికార ప్రతినిధి బుధవారం తెలిపారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నెల్లూరు రూరల్ పరిధిలోని సౌత్‌మోపూరు పంచాయతీలోని శ్రీరామ్‌నగర్ గిరిజనకాలనీలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. తమ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తమ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని పేర్కొన్నారు. అనంతరం పాలకీర్తి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, వెంకటేష్, పెంచలయ్య, జీవన్‌ప్రసాద్, కామాక్షమ్మ, రోజారాణి, ఉషారాణి, పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లోని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు, తదితరాలు ఏర్పాటు చేయకూడదు. గతంలో ఏర్పాటు చేసిన వాటిని సైతం తొలగించాలి. కానీ టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ మాకు వర్తించదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. నగరంలోని జేకేరెడ్డి వీధిలోని ఓ ఇంటి భవనంపై టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ వీపీఆర్ యువసేన అరవిందరెడ్డి ఆధ్వర్యంలో భారీ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు సైతం తమకు చూసీచూడనట్లుగా వదిలేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని రోడ్ల మీదకు పశువులను వదిలి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం మూలాపేట ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్ల మీద సంచరిస్తున్న పశువులను పట్టుకుని కల్లూరుపల్లి గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడమే కాకుండా వాహన ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని స్పష్టంచేశారు. వాటిని గోశాలకు తరలించి సంరక్షిస్తామన్నారు. పశువులను వాటి యజమానులు వారి ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలన్నారు. ఇప్పటికే పలుమార్లు పశువుల యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు ప్రచార మాధ్యమాల ద్వారా హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సురేంద్ర,ఇన్‌స్పెక్టర్లు షరీఫ్, చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పరం దాడులు

టీడీపీ నాయకులపై కేసులు నమోదు



తీవ్రగాయాలతో దివ్యతేజ

నెల్లూరు(క్రైమ్): ఆరో డివిజన్ టీడీపీ కార్యాలయం వేదికగా ఆ డివిజన్‌లోని నేతలు పరస్పర దాడులు చేసుకున్నారు. తీవ్రగాయాలపాలైన ఓ వర్గానికి చెందిన వ్యక్తి పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు తన తల పగులగొట్టారని టీడీపీ ‘ఎన్’ టీమ్ వాట్సాప్‌గ్రూప్‌లో పోస్టుచేశారు. పోలీసులు, సేకరించిన సమాచారం మేరకు..జీనిగాలవీధికి చెందిన దివ్యతేజ ఎన్నో ఏళ్లుగా టీడీపీ కార్యకర్తగా ఉన్నాడు. బూత్‌లెవల్ ఏజెంట్‌గానూ పనిచేశాడు. స్థానిక ఆరో డివిజన్ టీడీపీ నాయకుడు నరహరి చేష్టలతో కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో దివ్యతేజ తన స్నేహితుడు మల్లికార్జునతో కలిసి స్థానిక టీడీపీ కార్యాలయం వద్దకు బుధవారం వెళ్లారు. అక్కడ ఉన్న నరహరి ఇక్కడికి ఎందుకొచ్చావని దివ్యతేజను ప్రశ్నించారు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో నరహరిపై దివ్యతేజ చేయిచేసుకోవడంతో అక్కడున్న వారు ఇద్దరికి సర్దిచెప్పి పంపివేశారు. అనంతరం రహరి జరిగిన విషయాన్ని తన సోదరుడు, స్నేహితుడు సునీల్‌కు తెలియజేశారు. ముగ్గురూ కలిసి దివ్యతేజపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో తల పగిలి తీవ్రగాయాలయ్యాయి. దీంతో దివ్యతేజ పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు నరహరి, అతని తమ్ముడు సునీల్ తన తల పగులగొట్టారని టీడీపీ నగర నియోజకవర్గ అభ్యర్థికి చెందిన ‘ఎన్’ టీమ్ వాట్సప్‌గ్రూప్‌లో పోస్టు చేశారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాడులపై ఇరువర్గాలు నవాబుపేట పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

మా దారి అడ్డదారి



రైల్వే ప్రయాణికులు కొందరు అడ్డదారుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించి స్టేషన్‌కు చేరుకున్న వారు టీసీలకు దొరకకుండా ప్లాట్‌ఫామ్‌పై నుంచి ప్రమాదకరంగా గోడలు దూకి బయటకు వస్తున్నారు. ఈ దృశ్యాలు నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ వద్ద బుధవారం కనిపించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



చెల్లని చెక్కు కేసులో డాక్టర్‌కు ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో కావలి, క్రిస్టియన్‌పేటలోని ప్రతాప్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ అల్లం ప్రతాప్‌కుమార్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.10 లక్షలు పరిహారంగా చెల్లించాలని నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సుయోధన్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు..నెల్లూరు, బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన అమ్మినేని పెంచలయ్య వద్ద నుంచి ప్రతాప్‌కుమార్ 29.7.2015న తన అవసరాల నిమిత్తం రూ.3,50,000 అప్పు తీసుకుని ప్రామిసరి నోటు రాసి ఇచ్చాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో 29.1.2018న రూ.5,50,000 ఐసీఐసీ బ్యాంక్ లిమిటెడ్, నెల్లూరు బ్రాంచ్ పేరున చెక్కును ఫిర్యాదికి ఇచ్చాడు. సదరు చెక్కును ఫిర్యాదు అదే రోజు హరనాథపురంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లోని తన ఖాతాలో జమ చేశారు. నిందితుడి ఖాతాలో నగదు లేని కారణంగా చెక్కుబౌన్స్ అయిందని బ్యాంక్ అధికారులు 7.2.2018న మెమో ఇచ్చారు. దీంతో ఫిర్యాది 15.2.2018న లాయర్ ద్వారా లీగల్ నోటీస్ పంపారు. అనంతరం కోర్టులో నిందితుడిపై కేసు నమోదు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.